నెరవేరేనా.. సొంతింటి కల



మర్రిమంద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసి, పక్కా గృహాల నిర్మాణం చేపట్టింది. గత ప్రభుత్వం నిర్మాణ పనులను పరుగులెత్తించింది. జగనన్న కాలనీల పేరుతో నూతన గ్రామాలు, పట్టణాలను నిర్మించేందుకు కంకణం కట్టుకుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గృహాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలను సిద్ధం చేసి అక్టోబరు 2వ తేదీ నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పనులు మాత్రం జరుగడంలేదు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అవుతాయో లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. – ఏర్పేడు

- ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన పనులు
- జగనన్న కాలనీల్లో ముందుకు సాగని నిర్మాణాలు
- వంద రోజుల్లో పూర్తి చేస్తామని కూటమి హామీ
- మాట నెరవేర్చని కూటమి ప్రభుత్వం

ఏర్పేడు మండలంలోని కందాడు, ముసలిపేడు, పాగాలి, మర్రిమంద జగనన్న కాలనీల లేఅవుట్లలో 2340 నూతన గృహాల నిర్మాణాలకు 4.5 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మూడు విడతలుగా ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ల ద్వారా పేదలైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అప్పట్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. అందులో ఇప్పటివరకు 1640 శ్లాబ్ వేయగా 523 రూఫ్ లెవల్‌లో, 170 ఇళ్లు లింటల్ లెవల్‌లో ఉన్నాయి. కాలనీల్లో తాగునీటి బోర్లు, పైపులైన్, తాత్కాలిక రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధులన్నింటికీ నూతన స్తంభాలు, తీగలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టాప్ లెవల్ పూర్తయిన 1640 ఇళ్లను అక్టోబర్ 2 తేదీ నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంగా నిర్దేశించింది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. అయితే ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను కొనసాగించేందుకు చొరవ తీసుకోకపోవడం, కాంట్రాక్టర్లు సహకరించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూతన ప్రభుత్వం చొరవ చూపి ఆగిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సొంతింటి కలను నెరవేర్చండి



కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను పూర్తి స్థాయిలో నిర్మించాలి. ఇల్లు నిర్మాణం పూర్తి చేస్తే మా సొంతింటి కల నెరవేర్చినట్టు అవుతుంది. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే సంతోషిస్తాం. – జ్ఞానమ్మ, లబ్ధిదారు, చిందేపల్లి ఎస్సీ కాలనీ, ఏర్పేడు మండలం

ఆర్థిక స్థోమత లేదు



గత ప్రభుత్వం మా కుటుంబానికి జగనన్న కాలనీలో ఇంటి పట్టా మంజూరు చేసింది. కాంట్రాక్టర్ ద్వారా పక్కా గృహ నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం రూఫ్ లెవల్‌కు నిర్మించారు. మా కుటుంబానికి ఆర్థిక స్థోమత లేదు. కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఇల్లు నిర్మించి, ఆదుకోవాలి. – రత్నమ్మ, లబ్ధిదారు, చిందేపల్లి ఎస్సీ కాలనీ, ఏర్పేడు మండలం

కాంట్రాక్టర్లు అంగీకరించడం లేదు



లబ్ధిదారులు ఉపాధి హామీ బిల్లులు చెల్లించలేదని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు అంగీకరించడం లేదు. వారితో మాట్లాడుతున్నాం. కాలనీల్లో కొంతమంది కాంట్రాక్టర్ ప్రమేయం లేకుండా సొంతంగా నిర్మించుకుంటున్నారు. అలాంటి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల పనులు సాగుతున్నాయి. త్వరలోనే కాలనీల్లో పనులు చేపడుతాం. – అమర్‌నాథ్, హౌసింగ్ ఏఈ, ఏర్పేడు మండలం

క్లుప్తంగా

తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టరేట్



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు గురుస్వామి

ఏర్పేడు: హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మామిడికొమ్మ గురుస్వామి డాక్టరేట్ అందుకున్నారు. ఇప్పటి వరకు ఆయన పాడిన 1100 రంగస్థల పద్యాలు, 110 సినీగేయాలు, 101 భగవద్గీత శ్లోకాలతోపాటు జానపద గీతాలను పరిశీలించిన తమిళనాడుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ (ఐఎస్ఓ–యూఎస్ఏ) శనివారం తమిళనాడు రాష్ట్రం, హోసూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో యూనివర్సిటీ డైరెక్టర్ ప్రకాష్ చేతుల ద్వారా ప్రశంసా పత్రం మెడల్ అందుకున్నారు. ఏర్పేడు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టరేట్ రావడంతో పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: నగరివీధిలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన 1వ పట్టణ సీఐ గోపి మాట్లాడుతూ పేదలైన దివ్యాంగులు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. సంస్థ అధ్యక్షుడు మునీర్‌బాషాను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, ఢిల్లీబాబు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మి వేడుకలు



ప్రార్థనలో మత పెద్దలు, ముస్లింలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధిలోని తిరుపతి –శ్రీకాళహస్తి జాతీయ రహదారి పక్కన ఉన్న సయ్యద్ మౌలాలి దర్గా వద్ద ఆదివారం గ్యార్మి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు సయ్యద్ ఆరిపుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫకీర్లు గంధమహోత్సవం నిర్వహించి జెండా ఊరేగింపు జరిపారు. గంధాన్ని జెండా వద్ద ఉంచి మత పెద్ద షేక్ మీర్జా సాహెబ్ పూజలు చేశారు. గంధాన్ని భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మహ్మద్ అవేజ్, అబుల్ ఫైజ్, అలీకొసర్, అలీఖుస్రో తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం



పాండూరు హైస్కూల్‌లో బోరు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్లో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు జిల్లా పరిషత్ నిధుల నుంచి స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. స్కూల్‌లో తాగునీటి సమస్య గురించి పాఠశాల హెచ్ఎం విమలకుమారి, స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరిని కలిసి విన్నవించారు. స్పందించిన ఆమె జెడ్పీటీసీతో చర్చించి బోరు, మోటారుకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం బోరు డ్రిల్ చేయించగా నీరు సైతం పుష్కలంగా పడినట్లు జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. త్వరలో మోటారు అమర్చి విద్యార్థుల దాహార్తి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీటీసీ తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నితిన్‌రెడ్డి



నాగలాపురం: మండల వైస్ ఎంపీపీ కుమారి కుమారుడు నితిన్‌రెడ్డి యోగాలో సత్తా చాటుతున్నాడు. ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి యోగా పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. దీంతో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్‌లో ఈ పోటీలు జరగనున్నట్లు వైస్ ఎంపీపీ తెలిపారు. విద్యార్థి నితిన్‌రెడ్డి రేణిగుంట మండలం మామండూరులోని కేశవరెడ్డి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.

వైఎస్సార్ సీపీ నాయకుడి అవయవదానం



మహేష్ యాదవ్ (ఫైల్)

రేణిగుంట: ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు పి.డి.మహేష్‌యాదవ్(37) అవయవదానం చేయడం ద్వారా సజీవంగా ఉన్నాడని కుటుంబీకులు అభిప్రాయపడుతున్నారు. ఆయన కళ్లు, గుండె, కిడ్నీలు తదితర ఏడు రకాల అవయవాలను దానం చేశాడు. మహేష్ యాదవ్ మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. తొలి నుంచి గ్రామంలో మహేష్ కుటుంబం వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారన్నారు.

చికిత్స పొందుతూ మృతి

రేణిగుంట మండలం కరకంబాడి దొడ్లమిట్టకు చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు పి.డి.మహేష్ యాదవ్(37) ఆదివారం మృతి చెందాడు. నాలుగు రోజుల కిందట కరకంబాడి సమీపంలో బైక్‌పై వెళుతూ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి: 12వ పీఆర్సీ కమిషన్ నియమించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ గత జూలై నుంచి 12వ పీఆర్సీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాలని, అయితే ఇంత వరకు అమలు చేయలేదన్నారు. అదే విధంగా 90 నెలలు డీఏ బకాయిలు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం, విద్యాశాఖ మంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి మున్సిపల్, ఎయిడెడ్, మోడల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, సుధాకర్, చెంచురాజు, గోపాల్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైలెవెన్స్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సురేష్, రహీం

రేణిగుంట: అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని మైదానంలో వై లెవెన్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఆదివారం రమేష్ లెవెన్స్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి టీవీఆర్ లైఫ్ ఫిష్ అండ్ మీట్స్ అధినేత టి.సురేష్, గురవరాజుపల్లి మాజీ ఉప సర్పంచ్ రహీం ముఖ్య అతిథులుగా పాల్గొని క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. టోర్నమెంట్లు పాల్గొనడానికి రాష్ట్రం నలువైపుల నుంచే కాకుండా తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుండి జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. టోర్నీలో గెలుపొందిన విజేతకు ట్రోఫీ, మొమెంటోతో పాటు రూ.1 లక్ష, రెండో స్థానం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.50 వేల నగదు బహుమతి, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25 వేల నగదు అందజేస్తారు. టోర్నమెంట్లో ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును టోర్నమెంట్ ఆర్గనైజర్స్ అందజేస్తారు. ఈ టోర్నమెంటులో 35 జట్లు తలపడడానికి సిద్ధమయ్యాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి బాల్య వివాహం



బాల్య వివాహంపై కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి రూరల్: మండల పరిధిలోని ఎర్రమరెడ్డిపల్లిలో జరిగిన బాల్య వివాహం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు ఒత్తిళ్లకు తలొగ్గి ఎటువంటి చర్యలు తీసుకోకుండా పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదిర్చిన సంఘటన ఆదివారం శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది. ఎర్రమరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన 14 సంవత్సరాల బాలికకు అదే గ్రామానికి చెందిన 31 సంవత్సరాల అబ్బాయికి శుక్రవారం తెల్లవారుజామున బాల్య వివాహం జరిపించారు. గ్రామంలోని ఏఎన్ఎం, మహిళా పోలీస్ ఇచ్చిన సమాచారం అందుకు ఎర్రమరెడ్డిపల్లికి ప్రగతి సంస్థ ఎంసీఓ ప్రభాకర్, సిబ్బంది బాలిక నివాసం వద్దకు చేరుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శ్రీకాళహస్తి పోలీస్ స్టేషన్లో వరుడిపై కేసు నమోదు చేయడానికి ప్రగతి సంస్థ వారు చేరుకున్నారు. అయితే పోలీసులు కేవలం కౌన్సెలింగ్ ఇచ్చి వరుడిని, కుటుంబ సభ్యులను పంపేశారు. చదువు మధ్యలో ఆగిపోకూడదని ప్రగతి సంస్థ వ్యక్తిగత చొరవ తీసుకుని బాలికను రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేంద్రరావు

శ్రీకాళహస్తి: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాఘవేంద్రరావు అన్నారు. పట్టణంలోని బహదూరుపేటలో జ్ఞానప్రసూనాంబ ధ్యానసేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధ్యానకేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు, పెద్దలు అధిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీనికి విరుగుడు ధ్యానమేనన్నారు. ప్రతి ఒక్కరు ధ్యానంతో మానసిక ఉల్లాసాన్ని పొందాలన్నారు. ధ్యానం సకల రోగ నివారిణి అన్నారు. పట్టణ ప్రజలకు ఇక్కడ ఉచితంగా ధ్యానం నేర్పిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

నాగలాపురం: మండల కేంద్రంలోని టీఆర్ఆర్ కల్యాణ మండపంలో సత్యవేడు నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధి రాకేష్ ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారికి స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. వారి వెంట పార్టీ సీనియర్ నాయకులు బీరేంద్రవర్మ, భాను ప్రకాష్ రెడ్డి, అపరంజిరాజు, చిన్నదొరై, శ్యామ్, ఉదయ్ కుమార్ రెడ్డి, మోహన్ మొదలియార్, దేశప్పన్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న అమర్‌నాథ్

శ్రీకాళహస్తి: పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, 104 సిబ్బంది జీవితాల్లో దీపావళి నింపాలని సీఐటీయూ అనుబంధ 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 తిరుపతి జిల్లా యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు అందక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. 2005 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 2020 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి, మురళీమోహన్, పుల్లయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ రాష్ట్ర కార్యదర్శిగా గుత్తి త్యాగరాజు



నియామక పత్రం అందజేత

వరదయ్యపాళెం: కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్) సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా వరదయ్యపాళెంకు చెందిన గుత్తి త్యాగరాజును నియమిస్తూ ఆ సంస్థ ఫౌండర్ అనిల్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం తిరుపతిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. మానవ హక్కులపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పిస్తామని నూతనంగా నియమితులైన త్యాగరాజు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతి



రేణిగుంట-తిరుపతి మార్గంలో రోడ్డుకు పడిన గుంతల వద్ద బారికేడ్లు

రేణిగుంట: రేణిగుంట–తిరుపతి మార్గంలో వర్షాలకు మూడు నెలల కిందట హైవే రోడ్డుపై మూడు చోట్ల చిన్నపాటి సొరంగం లాంటి గండ్లు పడ్డాయి. అయితే ఆర్అండ్‌బీ అధికారులు వాటి మరమ్మతు చర్యలను పక్కన పెట్టి ఆ మార్గంలో అడ్డంగా బారికేడ్లను పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు బారికేడ్లు కనిపించకుండా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో నెలల తరబడి రోడ్డును బాగు చేయకపోవడంపై వాహనచోదకులు పెదవి విరుస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరచి, పని చేసే ఫోన్ నంబర్లను పొందుపర్చాలని ఆమె సూచించారు.

సత్తా చాటిన శ్రీకాళహస్తి విద్యార్థులు



పతకాలతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: కావలి పట్టణంలోని పట్టాభిరామ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జు జీట్స్ చాంపియన్‌షిప్ పోటీలలో శ్రీకాళహస్తి విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణానికి చెందిన సింహపురి కరాటే అకాడమీకి చెందిన కోచ్ ధనుష్ ఆధ్వర్యంలో జోషిత్ 45 కేజీల విభాగంలో, 42 కేజీల విభాగంలో లితిక బంగారు పతకాలు, 28 కేజీల క్లారిస్ కాంస్య పతకం, 28 కేజీల విభాగంలో నమస్వి కాంస్య పతకాలు సాధించారు. వీరికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వరదయ్యపాళెం: స్థానిక మద్యం దుకాణం నుంచి అధిక మొత్తంలో మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించేందుకు మద్యం తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. దొరవారిసత్రం మండలానికి చెందిన సుబ్రమణ్యం శనివారం రాత్రి వరదయ్యపాళెంలోని ఓ మద్యం దుకాణం నుంచి బాటిళ్లను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బందితో కలిసి సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



అపూర్వ సమ్మేళనం

శ్రీకాళహస్తి: దశాబ్దాల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్నారు. కలిసిమెలిసి ఆలోచనలు పంచుకున్నారు. ఒకరిపై ఒకరు అభిమానం పెంచుకున్నారు. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత రెక్కలొచ్చిన పక్షుల్లా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. సుమారు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవాలని సంకల్పించారు. అందులో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఆత్మీయ ఆలింగనాలతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని మురిసిపోయారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకుని సంబరపడ్డారు. కీర్తిశేషులైన మిత్రుల పేరిట అన్నదానం చేపట్టారు. బంగారు భవితకు బాటలు వేసిన బడికి తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పగడాల రాజు, మొగరాల గణేష్, రామిశెట్టి శ్రీనివాసులు, అనిల్, సెన్నీరు కుప్పం శేఖర్, రాధామాధవి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు







ఆలయం వద్ద న్యాయమూర్తి మంగేష్ పటేల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం వేర్వేరు సమయాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ముంబయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంగేష్ పటేల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ దర్శించుకున్నవారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం





సుధాకర్‌రెడ్డి, రవికుమార్

శ్రీకాళహస్తి: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ తొట్టంబేడు మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వి.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఢిల్లీబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిర్మల వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8వ తేదీలలో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండు రామచంద్రయ్య, మోహన్‌బాబు, వెంకటకృష్ణ, దీపిక, హేమాంబరరావు, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధపూజ

ఏర్పేడు: ఎస్పీడీసీఎల్ ఉప కేంద్రంలో ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఉప కేంద్రంలోని వివిధ విభాగాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, పరికరాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. గుమ్మడికాయలతో దిష్టి తీశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం కార్యదర్శి జయరామయ్య, డీఈఈ రంగారావు, ఏఏఓలు నాగేశ్వరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఏఈ చలపతి ఆధ్వర్యంలో ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. కార్యాలయంలోని దేవుడి పటాలను పూలతో అలంకరించి, భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దిష్టి తీసి, టెంకాయలు, గుమ్మడికాయలు కొట్టారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.







ఏర్పేడు: ఆయుధ పూజ చేస్తున్న ఏఈ వాసుదేవయ్య, డిస్కం కార్యదర్శిని సన్మానిస్తున్న ఏఈ, బుచ్చినాయుడుకండ్రిగ: పూజలు చేస్తున్న ఏఈ, సిబ్బంది